# హైదరాబాద్ ఓటమి



హైదరాబాద్: దేశవాళీ ప్రతిష్టాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ ఎలైట్ 2024-25 సీజన్‌ను హైదరాబాద్ ఓటమితో ఆరంభించింది. స్థానిక జింఖానా గ్రౌండ్స్ వేదికగా గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 126 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్.. తొలి ఇన్నింగ్స్‌లో 343 పరుగులకు ఆలౌట్ కాగా హైదరాబాద్ 248 పరుగులకే కుప్పకూలింది. అనంతరం గుజరాత్ రెండో ఇన్నింగ్స్‌లో 201 రన్స్ చేయగా 297 పరుగుల ఛేదనలో హైదరాబాద్ 170 పరుగులకు ఆలౌట్ అయి భారీ పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆ జట్టు బ్యాటర్ మనన్ హింగ్రజియాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. ఇక మిగిలిన మ్యాచ్‌లలో హిమాచల్ ప్రదేశ్, సర్వీసెస్ హర్యానా, కేరళ, తమిళనాడు, బరోడా, విదర్భ విజయాలు సాధించాయి. ఈ టోర్నీలో రెండో అంచె పోటీలు ఈనెల 18 నుంచి మొదలవుతాయి.

# స్టోక్స్ వచ్చేశాడు



ముల్తాన్: సుమారు రెండునెలల పాటు జాతీయ జట్టుకు దూరమైన ఇంగ్లండ్ సారథి బెన్ స్టోక్స్ మళ్లీ ఫీల్డ్‌లోకి అడుగుపెట్టనున్నాడు. తొడ కండరాల గాయం నుంచి కోలుకున్న స్టోక్స్.. పాకిస్థాన్‌తో ముల్తాన్ వేదికగా మంగళవారం నుంచి మొదలుకాబోయే రెండో టెస్టుకు అందుబాటులో ఉండనున్నాడు. రెండో టెస్టుకు సీనియర్ పేసర్ క్రిస్ వోక్స్‌కు సెలక్టర్లు విశ్రాంతినివ్వగా అతడి స్థానంలో స్టోక్స్ తుది జట్టులోకి రానున్నాడు. యువ బౌలర్ గస్ అట్కిన్సన్ స్థానాన్ని మాథ్యూ పాట్స్ భర్తీ చేయనున్నాడు. పాకిస్థాన్ కూడా తమ తుదిజట్టులో పలు మార్పులు చేయనుంది. ఇదివరకే స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్, పేసర్ షహీన్ షా అఫ్రిది వంటి సీనియర్లను పక్కనబెట్టిన పాక్.. రెండో టెస్టులో నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగనున్నట్టు తెలుస్తోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉండగా రెండో టెస్టు గెలిచి సిరీస్ సమం చేయాలనే పట్టుదలతో పాకిస్థాన్ ఉంది.

# తిండీ, నీళ్లు లేకుండా 16 గంటలు



ట్రిపోలి (లిబియా) : నైజీరియా ఫుట్‌బాల్ జట్టు ఆటగాళ్లకు ఊహించని పరిస్థితి ఎదురైంది. ఆఫ్రికా నేషన్స్ కప్‌లో భాగంగా రెండు మ్యాచ్‌ల సిరీస్ కోసం లిబియాలోని బెంఘాజీకి బయల్దేరిన నైజీరియా ఆటగాళ్లు ప్రయాణిస్తున్న విమానానికి లిబియా అనుమతి నిరాకరించింది. దీంతో బెంఘాజీకి 240 కిలోమీటర్ల దూరంలోనే వాళ్లు ఆగిపోవాల్సి వచ్చింది. అల్ అబ్రాక్ విమానాశ్రయంలో తిండీ, నిద్ర లేకుండా రాత్రంతా పడిగాపులు కాశారని, తమ విమాన అనుమతి కోసం 16 గంటల పాటు వేచి చూశారని నైజీరియా తెలిపింది. తమకు ఇంత అవమానం కలిగించిన లిబియాకు తగిన గుణపాఠం చెబుతామని, ఆ దేశంతో సాకర్ మ్యాచ్ ఆడబోమని నైజీరియా సాకర్ జట్టు తేల్చి చెప్పింది.

# అన్నీ శుభ శకునములే

**కుర్రాళ్లు సూపర్ హిట్ • జట్టు నిండా ఆల్‌రౌండర్లు • సెలెక్టర్లకు కొత్త తలనొప్పులు**




హైదరాబాద్ : ఈ ఏడాది వెస్టిండీస్‌లో ముగిసిన ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో ట్రోఫీ నెగ్గిన తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా వంటి దిగ్గజాలు ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన నేపథ్యంలో వారి వారసులెవరా? అన్న చర్చ సాగుతున్న వేళ బంగ్లాదేశ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ద్వారా భారత మేనేజ్‌మెంట్‌కు ఆ ఖాళీలను పూరించే సదావకాశం దక్కింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో బరిలోకి దిగిన యువ భారత ఆటగాళ్లు తమకు అందివచ్చిన అవకాశాలను రెండు చేతులా వినియోగించుకున్నారు. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించకపోవడం మినహా కుర్రాళ్లు అంచనాలకు మించి రాణించి సెలక్టర్లు, జట్టు యాజమాన్యానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు. మయాంక్ యాదవ్ రూపంలో జట్టుకు నిఖార్సైన పేసర్ దొరకగా నితీశ్ రెడ్డి, రియాన్ పరాగ్ ఆల్‌రౌండర్ల స్థానాన్ని భర్తీ చేసేందుకు 'మేమున్నాం' అంటూ దూసుకొచ్చారు. ఎన్ని అవకాశాలిచ్చినా వాటిని సరిగ్గా వినియోగించుకోలేక చతికిలపడుతున్న సంజూ శాంసన్.. చివరి మ్యాచ్‌లో శతకంతో చెలరేగి తన స్థానాన్ని పటిష్టపరుచుకున్నాడు.

## శాంసన్ కమ్‌బ్యాక్



జట్టులోకి వచ్చి దాదాపు పదేండ్లు కావొస్తున్నా సంజూ శాంసన్ ఇప్పటికీ (బంగ్లాతో సిరీస్ ముందువరకూ) తన స్థానాన్ని సుస్థిరం చేసుకోలేకపోయాడు. టాలెంట్ కొండంత ఉన్నప్పటికీ ఆవగింజంతైనా అదృష్టం లేక భారత క్రికెట్‌లో మోస్ట్ అన్‌లక్కీయెస్ట్ క్రికెటర్‌గా మిగిలిపోయాడు. ఇటీవలే శ్రీలంకతో ముగిసిన టీ20 సిరీస్‌లో వరుసగా రెండు డకౌట్లతో నిరాశపరిచినా గంభీర్, కెప్టెన్ సూర్య అతడిపై నమ్మకముంచారు. కానీ తొలి రెండు మ్యాచ్‌లలో అతడి ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. దీంతో ఉప్పల్ మ్యాచ్ అతడికి లైఫ్ అండ్ డెత్‌గా మారింది. అయితే మూడో టీ20లో అతడు తన ఆటలో లోతెంతో చూపించాడు. క్రీజులో కుదురుకుంటే తానెంత ప్రమాదకారో ప్రపంచానికి సగర్వంగా చాటిచెప్పాడు. వాస్తవానికి సంజూ భారత్‌కు ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్ కాకున్నా ఈ శతకంతో అతడు రిషభ్ పంత్‌కూ పోటీనిచ్చినట్టే. తాజా ప్రదర్శనతో అతడు సౌతాఫ్రికాతో రాబోయే టీ20 సిరీస్‌లో తన స్థానాన్ని నిలుపుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

### సరిపడా ఆల్‌రౌండర్లు

జడేజా రిటైర్మెంట్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలో భారత్‌ను వేధించే ఆల్‌రౌండర్ల కొరతకు ఈ సిరీస్‌తో ముగింపు పడ్డట్టే! నితీశ్ కుమార్ రూపంలో జట్టుకు పేస్ ఆల్‌రౌండర్ దొరికాడు. ఢిల్లీలో జరిగిన రెండో టీ20లో 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులోకి వచ్చి అతడు.. 34 బంతుల్లోనే 74 పరుగులతో సత్తా చాటాడు. అంతర్జాతీయ కెరీర్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్నప్పటికీ బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగి జట్టు శాసించే స్థితిలో నిలిపాడు. ఇదే మ్యాచ్‌లో అతడు బంతితోనూ రెండు వికెట్లు పడగొట్టాడు. మిగిలిన రెండు మ్యాచ్‌లలోనూ బ్యాట్‌తో అవకాశాలు రాకపోయినా బౌలింగ్‌లో మాత్రం రాణించాడు. అభిషేక్ శర్మ బ్యాట్‌తో విఫలమైనప్పటికీ బౌలింగ్‌లో తన గురువు యువరాజ్ సింగ్ బాటలో నడుస్తున్నాడు. పెద్దగా అవకాశాలు రాకపోయినా రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్ సైతం ఆల్‌రౌండర్ల స్థానాన్ని భర్తీ చేసే యత్నం చేశారు.

### దూకుడు మంత్రం

బంగ్లాదేశ్‌తో కాన్పూర్ వేదికగా ముగిసిన రెండో టెస్టులో సుమారు రెండున్నర రోజుల ఆట వర్షార్పణమైనప్పటికీ దూకుడైన ఆటతో సీనియర్లతో అద్భుతం చేసిన కోచ్ గౌతం గంభీర్.. పొట్టి ఫార్మాట్‌లో కుర్రాళ్లతోనూ అదే ఫలితాన్ని రాబట్టాడు. కెప్టెన్ సూర్య కూడా సిరీస్ ఆరంభంలో తన జట్టు నిస్వార్థంగా ఆడుతుందని ప్రకటించినట్టుగానే ఆటగాళ్ల ఆటతీరులోనూ మార్పు వచ్చింది. తొలి టీ20లో చేయాల్సింది 128 పరుగులే అయినప్పటికీ ప్రత్యర్థిపై ఏమాత్రం ఉదాసీనత ప్రదర్శించకుండా 11 ఓవర్లలోనే భారత్ మ్యాచ్‌ను ముగించింది. శాంసన్, సూర్య, పాండ్యా ఆది నుంచే ఎదురుదాడికి దిగి భారత్‌కు ఘనవిజయాన్ని అందించారు. రెండో టీ20 ఆరంభంలో తడబడ్డా తర్వాత నిలదొక్కుకున్న భారత్.. భారీ స్కోరుతో ప్రత్యర్థికి చెమటలు పట్టించింది. ఇక హైదరాబాద్ మ్యాచ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పన్లేదు. ఆ దూకుడే టీ20లలో భారత్‌కు రికార్డు స్కోరు (297)ను కట్టబెట్టింది. ఒక్క బ్యాటింగ్‌లోనే గాక బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ టీమ్‌ఇండియా దూకుడు మంత్రాన్ని పటిస్తూ ఫలితాలు రాబడుతోంది.

### దూసుకొచ్చిన నయా పేసు గుర్రం..



గత ఐపీఎల్‌లో గంటకు 155 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి ప్రపంచ దిగ్గజ పేసర్లతో ఔరా! అనిపించిన యువ పేసర్ మయాంక్ యాదవ్ తన అరంగేట్రాన్ని ఘనంగా చాటాడు. నిఖార్సైన పేస్‌తో పాటు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు విసురుతూ బంగ్లా బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. సిరీస్‌లో అతడు 4 వికెట్టే పడగొట్టినా ఆరంభంలో పరుగుల కట్టడి చేయడంలో కీలకపాత్ర పోషించాడు. వేగం కంటే కచ్చితత్వంపై దృష్టి పెట్టిన మయాంక్ ఆ విషయంలో పూర్తిగా విజయవంతమయ్యాడు. త్వరలో భారత్.. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడనున్న నేపథ్యంలో మయాంక్ ఇదే ప్రదర్శనను పునరావృతం చేస్తే టెస్టులలోనూ అరంగేట్రం చేసే అవకాశాలుంటాయి.

# కివీస్ సెమీస్‌కు.. భారత్ ఇంటికి

• **మహిళల టీ20 ప్రపంచకప్**



దుబాయ్: ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. సోమవారం దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 54 పరుగుల తేడాతో గెలిచి గ్రూప్-ఏ నుంచి ఆస్ట్రేలియా తర్వాత సెమీస్ చేరిన రెండో జట్టుగా నిలిచింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్.. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 110 పరుగులే చేయగలిగింది. సూజీ బేట్స్ (28) టాప్ స్కోరర్. పాక్ బౌలర్లలో నశ్రా సంధు (3/18) కివీస్‌ను కట్టడిచేసింది. కానీ స్వల్ప ఛేదనలో పాక్.. 11.4 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ ఫాతిమా సనా (21), ఓపెనర్ మునీబా అలీ (15) మినహా మిగిలినవారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అమేలియా కెర్ (3/14), ఎడెన్ కార్సన్ (2/7) పాక్ పని పట్టారు. ఈ మ్యాచ్‌లో పాక్ ఓడటంతో టోర్నీ నుంచి భారత్ నిష్క్రమించింది.



# చరిత్ర సృష్టించిన కెన్యా అథ్లెట్

చికాగో: కెన్యా అథ్లెట్ రుత్ చెప్నెగెటిక్ మారథాన్ పరుగు పందెంలో సరికొత్త చరిత్ర లిఖించింది. ట్రాక్ మీద తనకు తిరుగులేదని మరోసారి చాటిచెబుతూ రెండు నిమిషాల తేడాతో రికార్డులు బద్దలుకొట్టింది. సోమవారం చికాగో వేదికగా జరిగిన మారథాన్ పోటీలలో 30 ఏండ్ల చెప్నెగెటిక్.. 2 గంటల 09 నిమిషాల 56 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. గతంలో ఈ రికార్డు ఇథియోపియా అథ్లెట్ టిగిస్ట్ అస్ఫెఫా పేరిట (2:11:53 ని.) పేరిట ఉండేది.

## న్యూజీలాండ్‌తో వన్డే సిరీస్

ముంబై: దుబాయ్ వేదికగా జరుగుతున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ ముగియగానే భారత జట్టు స్వదేశంలో న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈనెల 24, 27, 29 తేదీలలో టీమ్‌ఇండియా.. కివీస్‌తో వన్డేలు ఆడనుంది. ఇదే సమయంలో న్యూజిలాండ్ పురుషుల జట్టు సైతం భారత గడ్డపై మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.